

నేడు యథావిధిగా 'ప్రజాసమస్యల పరిష్కార వేదిక'

ప్రజాశక్తి-రాయచోటి

ప్రజల నుంచి వారి సమస్యలను స్వీకరించి, వాటిని పరిష్కరించేందుకు సోమవారం ఉదయం 10 గంటల నుంచి ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమాన్ని జిల్లా కేంద్రం రాయచోటి తో పాటు గ్రామ, మండల, డివిజన్ స్థాయిలో యధావిధిగా నిర్వహిస్తున్నట్లు కలెక్టర్ శ్రీధర్ చామకూరి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. అర్జీదారులు తమ విజ్ఞప్తులను సంబంధిత గ్రామ, మండల, డివిజన్లలో అధికారులకు ఇవ్వాలని ఆయన సూచించారు. మండల, డివిజన్ స్థాయిలో సమస్యలు పరిష్కారం కాని అర్జీదారులే జిల్లా కేంద్రంలో జరిగే ప్రజా సమ స్యల పరిష్కార వేదిక కార్యక్రమానికి రాగలరని తెలిపారు.

సంక్షేమ పథకాల అమలు
చంద్రబాబుకే సాధ్యం

డిఎస్‌సి ద్వారా నిరుద్యోగులకు ఉద్యోగవకాశాలు
రవాణా శాఖమంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి



విలేకర్ల సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి

ప్రజాశక్తి-రాయచోటి

సంక్షేమ అభివృద్ధి కార్యక్రమాలు అమలు చేయడం ముఖ్యమంత్రి చంద్రబాబుకే సాధ్యమని రాష్ట్ర రవాణా, యువజన క్రీడాశాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి పేర్కొన్నారు. ఆదివారం పట్టణంలోని తమ క్యాంపు కార్యాలయంలో విలేరుల సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సిఎం చంద్రబాబు గతంలో ఎవరూ చేయని విధంగా అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు అమలు చేస్తూ రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో పరుగులు పెట్టిస్తున్నారని అన్నారు. అభివృద్ధి, సంక్షేమ పథకాల అమలు గురించి మాట్లాడే అర్హత నాయకులకు లేదన్నారు. గత ఐదేళ్లలో వైసిపి ప్రభుత్వం ఎటువంటి అభివృద్ధి చేయకుండా రాష్ట్రాన్ని దివాలా తీసిందన్నారు. కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీలన్నీ తప్పక నెరవేర్చడం జరుగుతుందన్నారు. ప్రభుత్వం అమలు చేసే సంక్షేమ పథకాల గురించి వైసిపి వారు అసత్య ప్రచారం చేస్తే ప్రజలు నమ్మే పరిస్థితులలో లేరన్నారు. అవ్వ తాతలకు ఇచ్చే పింఛన్‌తో సంతోషంగా జీవిస్తున్నారన్నారు. ఫిబ్రవరి లేక మార్చిలో డిఎస్‌సి నోటిఫికేషన్ వదిలి నిరుద్యోగులకు ఉద్యోగ అవకాశాలు కల్పించడం జరుగుతుందన్నారు. డిఎస్‌సిలో ఎటువంటి అవకతవకలు జరగకుండా మంచి మార్కులతో ఉత్తీర్ణులైన అభ్యర్థులకు మాత్రమే ఉద్యోగ అవకాశాలు కల్పించడం జరుగుతుందన్నారు. ఉచిత గ్యాస్ పథకం ద్వారా రాష్ట్ర వ్యాప్తంగా 45 లక్షల గ్యాస్ సిలిండర్లు ఇప్పటికే ప్రజలు తీసుకున్నారని అన్నారు. రైతులకు ఏదైతే చెప్పామో రైతులకు ఇచ్చిన హామీలన్నీ తప్పక నెరవేర్చడం జరుగుతుందన్నారు. ఎక్కడైనా మంచి జరుగుతుంటే సంతోషించాలి గాని అభివృద్ధి చేయడం లేదని అసత్య ప్రచారం చేయడం వైసిపి నాయకులకే దక్కుతుందన్నారు. ప్రభుత్వం గురించి సోషల్ మీడి యాలో తప్పుడు ప్రచారం చేసినట్లయితే అలాంటి వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుని శిక్షించడం జరుగుతుందన్నారు. సమావేశంలో టిడిపి నాయకులు డాక్టర్ విద్యాధర్, శ్రీనివాసుల రెడ్డి, రవీంద్ర రెడ్డి పాల్గొన్నారు.

ప్రభుత్వానికి అభివృద్ధి, సంక్షేమం రెండు కళ్లు

ప్రజాశక్తి - చిన్నమండెం : ప్రభుత్వానికి అభివృద్ధి, సంక్షేమం రెండు కళ్లలాంటివని రవాణా శాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి పేర్కొన్నారు. మండలంలోని వండాడి గ్రామంలో సిసి రోడ్డు నిర్మాణానికి ఆదివారం మంత్రి భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గతంలో ఎవరు చేయని విధంగా ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు రాష్ట్రంలో వివిధ అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాలు అమలు చేస్తూ రాష్ట్రాన్ని అభివృద్ధిలో పరుగులు పెట్టిస్తున్నారని పేర్కొన్నారు. రాబోయే రోజుల్లో ప్రతి గ్రామంలో సిమెంట్ రోడ్లు, డ్రెయినేజీ కాలువలు, వీధిలైట్లు తదితర మౌలిక వసతులు కల్పించి గ్రామాలను ఆదర్శంగా తీర్చిదిద్దుతామని చెప్పారు. కూటమి ప్రభుత్వం ఏర్పడిన ఎనిమిది నెలలకే ప్రభుత్వం చేపట్టే వివిధ అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాలను చూసి ప్రజలు బ్రహ్మరథం పడుతున్నారన్నారు. రాబోయే రోజులలో రాయచోటి నియోజకవర్గంలో శాశ్వత నీటి సమస్య లేకుండా చేస్తామని తెలిపారు. రైతుల సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకొని ప్రతి చెరువులో పూడికతీత పనులు చేపట్టి చెరువు మరమ్మతు పూర్తి చేస్తామన్నారు. ఇలాంటి మంచి ప్రభుత్వం పది కాలాలపాటు ఉండేందుకు ప్రతి ఒక్కరూ సహకరించాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. కార్యక్రమంలో పలువురు అభిమానులు అధికారులు కార్యకర్తలు పాల్గొన్నారు.

ప్రజాదర్బార్ సమస్యలను నిర్లక్ష్యం చేయరాదు

ప్రజలు వివిధ సమస్యలపై ప్రజాదర్బార్ కార్యక్రమానికి వస్తుంటారని, వారు సమర్పించే అర్జిలను నిర్లక్ష్యం చేయకుండా ఎప్పటికప్పుడు పరిష్కరించాలని మంత్రి పేర్కొన్నారు. మండలంలోని బోరెడ్డి గారి పల్లెలో తమ నివాసంలో మంత్రి ఆదివారం ప్రజాదర్బార్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అన్నమయ్య జిల్లాలో ఎక్కువగా భూ సమస్యలు ఉన్నాయని, రెవెన్యూ అధికారులు ప్రత్యేక శ్రద్ధచూపి పరిష్కరించాలన్నారు. ప్రస్తుత వేసవి కాలంలో నీటి సమస్య తలెత్తకుండా తగు చర్యలు చేపడుతారన్నారు. రాయచోటి నియోజకవర్గంలో శాశ్వత భూ సమస్యల పరిష్కారానికి సంబంధిత అధికారులు అందరూ సమన్వయంతో పని చేయాలన్నారు. ఈ సందర్భంగా జిల్లా నలుమూలల నుంచి వచ్చిన బాధితుల సమస్యలను మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి స్వీకరించి వాటి పరిష్కారానికి సంబంధిత అధికారులకు ఎండార్స్ చేస్తూ ఆదేశాలు జారీ చేశారు.

మత్స్యకారుల అభివృద్ధికి కృషి

జిల్లా మత్స్యశాఖ అధికారి ఎస్.సుస్మిత



ముఖా ముఖి..

ప్రజాశక్తి- రాయచోటి

జిల్లాలో మత్స్య కారులందరికీ అందుబాటులో ఉంటూ వారికి జీవన ఉపాధి కల్పించి, సంపదకు కృషి చేస్తానని జిల్లా మత్స్యశాఖ అధికారి ఎస్. సుస్మిత పేర్కొన్నారు. అన్నమయ్య జిల్లాలో మత్స్య శాఖకు, కార్మికులకు, వారి కుటుంబాలకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నుంచి వచ్చే సబ్సీడీలు, ఇతర పథకాలు, ఉపాధి జీవ నాధారం ఎలో పొందాలో ప్రజాశక్తికి ఇచ్చిన ముఖాముఖిలో ఆమె వివరించారు.

అన్నమయ్య జిల్లాలో మత్స్యశాఖ కార్యాలయాల వివరాలు తెలియజేయండి?

జిల్లా వ్యాప్తంగా మత్స్యశాఖ కార్యాలయాలు బహుదా, పీలేరులలో, సహాయ మత్స్య శాఖ కార్యాలయం రాజంపేట, మత్స్యశాఖ అభివృద్ధి కార్యాలయం మదనపల్లిలో ఉన్నాయి. గాలివీడు, గుర్రంకొండ, నిమ్మనపల్లె, పెద్దమండెం, వాల్మీకిపురం, చిన్నమండెం, బి. కొత్తకోట, కురబలకోట, మదనపల్లె, ములక చెరువు, పెద్ద తిప్పి సముద్రం, రామసముద్రం, తంబళ్లపల్లె, లక్కిరెడ్డిపల్లె, రామాపురం, కలకడ, కంభంవారిపల్లె, పీలేరు ముండుపల్లె, సంబేపల్లి, చిట్వేలు, నందలూరు, ఓబులవారిపల్లె, పుల్లంపేట, పెనగలూరు, రైల్వే కోడూరు, రాజంపేట, వీరబల్లిలో ప్రాంతాలలో సబ్ డివిజన్ కార్యాలయాలు జిల్లా వ్యాప్తంగా ఉన్నాయి.

మత్స్యశాఖ అధికారుల పని వివరాలు తెలపండి?

మత్స్య శాఖలో చేప పిల్లలు పెంపకం, చెరువులు లీజులకు ఇవ్వడం, లైసెన్స్ రిజర్వాయర్లలో మత్స్య కారులకు లైసెన్సుల మంజూరు చేయిస్తాం. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అందిస్తున్న పథకాలను మత్స్య కారులకు అందజేయడం, వారికి అవగాహన సదస్సులు నిర్వహించడం, మత్స్యశాఖ అధికారుల పని విధానం.

జిల్లాలో లైసెన్స్ రిజర్వాయర్లు,చెరువుల ఎన్ని ఉన్నాయి?

జిల్లా వ్యాప్తంగా లైసెన్స్ జర్వాయర్లు 2 , చెరువులు 149 ఉన్నాయి. చేపల చెరువులకు తప్పనిసరిగా అనుమతులు తీసుకోవాలి.

మత్స్య శాఖకు ఆదాయాన్ని పెంచడానికి ఎలాంటి చర్యలు తీసుకుంటున్నారు ?

మత్స్యశాఖ ద్వారా రెండు రకాలు ఆదాయ పెంపుదలకు కృషి చేస్తున్నాం .ప్రధాన మంత్రి మత్స్య సంపద యువజన పథకం (పిఎంఎంఎస్) ద్వారా శాఖా పరంగా గుర్తించిన చెరువులలో సీడ్ చేసి, లైసెన్స్ రిజర్వాయర్లలో చేప పిల్లలను వదలడం ద్వారా చేపల వృద్ధి చెందడానికి అన్ని చర్యలు చేపడుతున్నాం. ఇటీవల కాలంలో వెలిగల్లు ప్రాజెక్టులు మంత్రి మండి పల్లి రాంప్రసాద్ రెడ్డి సహకారంతో 4 లక్షల, 80 వేలు చేప పిల్లలను వదిలారు. మత్స్యశాఖ శాఖలో లైసెన్స్ రిజర్వాయర్లో చేప పిల్లలను పెంచడం, నూతనంగా వచ్చే పథకాలను కార్మికులకు వివరిస్తున్నాం.

ఫిష్ దుకాణాలు ఎన్ని ఉన్నాయి ?

జిల్లా వ్యాప్తంగా 31 పిష్ దుకాణాలున్నాయి. అందులో 15 ద్విచక్ర వాహనాలు, త్రీ వీలర్ వాహనాలు 1, నాలుగు చక్ర వాహనాల 2 అందు బాటలో ఉన్నాయి.

మత్స్య శాఖ ద్వారా ఉపాధి అవకాశాలు ఏమైనా కల్పిస్తున్నారా?

జిల్లా వ్యాప్తంగా చెరువులలో చేపల పెంపకం, రవాణా ద్వారా డ్రైవర్లకు, కూలీలకు ఉపాధి అవకాశాలు కల్పిస్తున్నాం. వీటితో పాటు మత్స్య కారులకు ప్రభుత్వం నుంచి వచ్చే పథకాలను వివరించి వాటిని అమలు చేయడానికి కృషి చేస్తున్నాం.

జిల్లాలో సిబ్బంది కొరత ఏమైనా ఉందా?

జిల్లాలో మత్స్యశాఖలో సిబ్బంది కొరత ఉంది. ప్రస్తుతం ఉన్న సిబ్బంది తోనే విధులు నిర్వహిస్తున్నాం.

మత్స్యశాఖ లకు సలహాలు, సూచనలు ఏమైనా ఇవ్వాలనుకుంటున్నారా?

మత్స్యశాఖ కార్మికులందరూ డిపార్ట్మెంట్ కల్పించిన స్కీములను ప్రత్యేకంగా ఉపయోగించుకోవాలి. ప్రతి మూడు నెలలకు, 6 నెలలకు ఒకసారి మేనేజింగ్ కమిటీ సంఘల సమావేశాలకు తప్పనిసరిగా హాజరు కావాలి. ప్రభుత్వం నుంచి వచ్చే పథకాలన్నింటినీ కార్మికులు అందరూ ఉపయోగించుకోవాలి.

గణితశాస్త్ర ఉపాధ్యాయుడికి అరుదైన గౌరవం

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

మదనపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల గణిత శాస్త్ర ఉపాధ్యాయుడు ఒంటికొండ చలపతి నాయుడుకి అరుదైన గౌరవం లభించింది. స్వామి వివేకానంద జయంతి ఉత్సవాలు-2025ను పురస్కరించుకుని వివిధ విభాగాల్లో సేవలు అందించిన వారికి తెలుగు వెలుగు జాతీయ పురస్కారాలకు ఎంపిక చేశారు. గణిత శాస్త్రంలో విద్యార్థులకు సులువైన పద్ధతిలో అత్యుత్తమ బోధన చేసినందుకు, చలపతి నాయుడు సేవలను గుర్తించి జాతీయ పురస్కారాన్ని అందజేశారు. ఆదివారం విజయవాడలోని తుమ్మలపల్లి కళాక్షేత్రం నందు కాళోజి తెలుగు బుక్ ఆఫ్ రికార్డ్స్, తెలుగు వెలుగు సాహితి న్యూస్ సహకారంతో నిర్వహించిన కార్యక్రమంలో ఆయనకు ప్రముఖుల చేతుల మీదుగా పురస్కారాన్ని ప్రదానం చేశారు. ఈ సందర్భంగా చలపతి నాయుడు మాట్లాడుతూ గణితశాస్త్రంలో బోధనకుగాను జాతీయ నమస్కారం అందుకోవడం గర్వంగా ఉందన్నారు. పదవ తరగతి, ఇంటర్మీడియట్ విద్యార్థులకు గణితశాస్త్రం బోధిస్తూ వారిని సన్మార్గంలో నడిపిస్తున్నామన్నారు. విద్యాబోధన సక్రమంగా చేసినప్పుడే విద్యార్థులను ఉత్తమ ఫలితాలవైపు నడిపించవచ్చునన్నారు. ఈ పురస్కారం తన బాధ్యతను మరింత పెంచిందన్నారు. భవిష్యత్తులో మరింత నూతనోత్సాహంతో విద్యాబోధన చేస్తానని తెలిపారు. ఈ పురస్కారం రావడానికి అన్నివిధాల సహకరించిన ఉపాధ్యాయులు, మిత్రులు, శ్రేయోభిలాషులకు కృతజ్ఞతలు తెలిపారు.



అవార్డు అందుకుంటున్న చలపతి నాయుడు

కలకలం రేపుతున్న మహిళల హత్యలు

సింహాద్రిపురంలో వృద్ధురాలు , వేములలో మహిళ
వరుస హత్యలతో ఆందోళన చెందుతున్న ప్రజలు

ఇటీవల మహిళల హత్యలు ఆయా మండలాల్లో కలకలం రేపుతున్నాయి. సింహాద్రిపురం మండలంలో వృద్ధురాలిని, వేముల మండలంలో 50 ఏళ్ల మహిళను దారుణంగా హత్య చేశారు. రెండు హత్యల్లో ఒకటి ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. ఈ హత్య పాత గొడవలు కారణంగా జరిగినట్లు స్థానికులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. మరో మహిళ గేదెలు మోపుతుండగా బంగారు కోసం దొంగలు హత్య చేసి ఉంటారని పోలీసులు పేర్కొంటున్నారు. ఈ హత్యలతో రెండు మండలాల్లోని మృతుల గ్రామాల్లో ప్రజలు భయాందోళన చెందుతున్నారు.



వృద్ధురాలి హత్యపై స్థానికులను విచారిస్తున్న డిఎస్‌పి, సిఐ

ప్రజాశక్తి - సింహాద్రిపురం

మండలంలోని బిదినంచర్లలో పార్వతమ్మ (80) హత్యకు గుర య్యారు. శనివారం ఆమె రాత్రి ఇంట్లో నుంచి దుర్వాసన వస్తుండడంతో సమీ పంలోని వారు అనంతపురంలోని తమ కుమారులకు, పోలీసులకు సమా చారం అందించారు. దీంతో పోలీసులు తాళాలు పగలగొట్టి ఇంటిలోకి వెళ్లి చూడగా మృతురాలు హత్యకు గురైనట్లు గుర్తించారు. వారం రోజుల కిందట చంపి బయట తాళాలు వేసినట్లు తెలుస్తుంది. మృతురాలు శరీరంపై గాయాలు ఉం డడంతో పాటు మెడకు ఇనుప గొలుసు వేసి హత్యగా చేసినట్లు పోలీసులు అను మానిస్తున్నారు. మృతురాలికి ఇద్దరు కుమారులన్నారు. వారు అనంతపురంలో నివాసం ఉంటున్నారు. భర్త చాలా ఏళ్ల కిందట మృతి చెందారు.

మృతిపై పలు అనుమానాలు ..

మృతురాలు పార్వతమ్మ మృతిపై పలు అనుమానాలు రేకెత్తిస్తున్నాయి. ముఖ్యంగా తమ ఇంటి సమీపంలోని పుల్లారెడ్డి, కార్తికేయ రెడ్డితో తరచూ గొడవ పడుతుండదని తెలిసింది. దీంతో పలుమార్లు పోలీస్‌స్టేషన్లో సైతం ఆమె ఫిర్యాదు చేశారు. దీంతోపాటు పార్వతమ్మ ఇంటి సమీపంలో బెల్ట్ షాప్ సైతం నిర్వహించే వారిని దీని కారణంగా పలుమార్లు గొడవ దిగినట్టు గ్రామస్తులు చెబుతున్నారు.

సంఘటనా స్థలాన్ని పరిశీలించిన డిఎస్‌పి

మృతురాల హత్య జరిగిన ప్రదేశాన్ని పులివెందుల డిఎస్‌పి మురళీనాయక్, రూరల్ సిఐ వెంకటరమణ పరిశీలించారు. మృతికి గల కారణాలను గ్రామస్తులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం డాగ్ , క్లూస్ టీంతో పరిశీలన చేయించారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు. కార్యక్రమంలో ఎస్ఐ తులసి నాగప్రసాద్ పాల్గొన్నారు.

మహిళ దారుణ హత్య

వేముల :మండలంలోని కె.కె. కొట్టాల గ్రామానికి చెందిన సింగంశెట్టి పద్మావతి(50)దారుణ హత్య గురైంది. మృతురాలి భర్త సుబ్బారాయుడు తెలిపిన వివరాల మేరకు.. సింగంశెట్టి పద్మావతి ఆదివారం ఉదయం 10 గంటలకు సమయంలో గేదెలను మేత కోసం సమీపంలోని కొండల్లోకి వెళ్లింది. మధ్యాహ్నం సమయంలో ఎవరో గుర్తు తెలియని వ్యక్తి ఆ కొండ సమీపంలోని తోటలో మోటార్ స్టాటర్ దొంగతనానికి వచ్చాడు. ఆ దొంగను చూసి అదే ప్రాంతంలో మరో మహిళ గట్టిగా కేకలు వేయడంతో కొండ ప్రాంతంలోకి వెళ్లాడు. అక్కడే పద్మావతి గేదెలను మేపుతుండగా ఆ వ్యక్తి ఆమె మెడలోని గొలుసు, కమ్మలు చోరీ చేయడంతో బండరాయితో హత్య చేశాడు. ఆమె భర్త అనుమానం వచ్చి చూడదా కొండ కింద ప్రాంతంలో తీవ్ర గాయాలతో చనిపోయి ఉందని చెప్పారు. మృతురాలి మెడపై, తలపై గాయాలున్నాయి. మెడలోని గొలుసు, కమ్మలు, ఉంగరం లేవని ఎవరో గుర్తుతెలియని వ్యక్తి మహిళపై దాడి చేసి ఆమె ఒంటి మీద ఉన్న నగలను దొంగలిచారని అనుమాన వ్యక్తం చేశారు. విషయం తెలుసుకున్న సిఐఉలసయ్య, ఎస్ఐ ప్రవీణ్ కుమార్ సంఘటనా స్థలానికి చేరుకొని మృతురాలను పరిశీలించారు. అనంతరం క్లూస్ టీం మరియు డాగ్ స్కాడ్ తో తనిఖీలు చేపట్టి సంఘటనా స్థలం నుంచి పలు వస్తువులను స్వాధీనం చేసుకున్నారు. మృతురాలి దుస్తులు చిందరవందరగా ఉండడం పై ఆమెపై అత్యాచారం చేసి అనంతరం చంపి పారిపోయి ఉంటాడని స్థానికులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. హత్యవిషయం తెలుసుకున్న వైసిపి మండల అధ్యక్షుడు నాగేళ్ల సాంబశివరెడ్డి, జడ్‌పిటిసి కోకటం వెంకట భయపురెడ్డి, టిడిపి నాయకులు మబ్బు చింతలపల్లి శ్రీనాథ్ రెడ్డి మృతురాలి కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఈ విషయంపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.



హత్యకు గురైన పద్మావతి

ఉచిత వైద్యశిబిరానికి స్పందన

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

మండలంలోని పెంచుపాడుకి చెందిన దండు ప్రదీప్‌రెడ్డి కుమారుడు దండు మౌనిష్‌రెడ్డి పుట్టిన రోజు సందర్భంగా ఆదివారం పెంచుపాడులో ఉచిత వైద్యశిబిరం నిర్వహించారు. ఈ కార్యక్ర మానికి వైసిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జి నిస్సార్‌అహమ్మద్ ముఖ్య అతిథిగా హాజరై శిబిరాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పుట్టినరోజు వేడుకలను నిరాడంబరంగా జరుపుకొని పేదలకు సేవచేయాలనే దృక్పథం ప్రతిఒక్కరిలో రావాలని అన్నారు. అనవసర ఖర్చులు లేకుండా పేదలకు ఉచిత వైద్యం, అన్నదానం, దుస్తులు పంపిణీ, అనాథ చిన్నారులకు విద్య, గూడులేని పేదలకు సాయం చేసి పలువురికి ఆదర్శంగా నిలవాలని పిలుపునిచ్చారు. చిన్నారి పుట్టినరోజు సందర్భంగా దండు ప్యామిలీ వైద్యశిబిరం ఏర్పాటు చేయడం ప్రశంసనీయమని అన్నారు. ఈ వైద్యశిబిరంలో ప్రముఖ డాక్టర్లు ప్రజలకు వైద్య పరీక్షలు నిర్వహించి, ఉచిత మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే డాక్టర్ దేశాయ్ తిప్పారెడ్డి, మాజీ జిల్లా వక్ఫ్ బోర్డు చైర్మన్ ఎస్ఏ కరీముల్లా, మదనపల్లె రూరల్ వైసిపి కన్వీనర్ దండు కరుణాకర్ రెడ్డి, సర్పంచులు నాగరాజరెడ్డి, మనోహర్, శరత్ రెడ్డి, మొహమ్మద్ యూనిస్, మజ్జిగ కేశవ, కొత్తపల్లి మహేష్ బాబు, చరణ్, మల్లికార్జున రెడ్డి పెద్దసంఖ్యలో ప్రజలుపాల్గొన్నారు.



మందులు పంపిణీ చేస్తున్న నిస్సార్ అహమ్మద్



రిలే నిరాహార దీక్షకు మద్దతు తెలుపుతున్న వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు

ఎపిఎండిసి సబ్‌స్టాఫ్‌కు జీతాలు చెల్లించాలి

ప్రజాశక్తి-పుల్లంపేట

ఓబులవారిపల్లి మండల పరిధిలోని మంగంపేట ఎపిఎండిసి పబ్లిక్ స్కూల్‌లో నాన్ టీచింగ్, హౌస్ కీపింగ్, స్కావెంజర్స్, సబ్ స్టాఫ్‌ను అక్రమంగా తొలగించడం అన్యాయమని తక్షణమే విధుల్లోకి తీసుకోవాలని ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి పందికాళ్ళ మణి ఆదివారం డిమాండ్ చేశారు. రిలే నిరాహార దీక్షలు చేస్తున్న శిబిరాన్ని సందర్శించి ఆయన మాట్లాడుతూ గత మూడేళ్ల నుంచి నిర్వాసితులు పనిచేస్తుంటే కొత్తగా అక్రమంగా పలుకుబడి ఉపయోగించి లోపాయికారి ఒప్పందంతో అగ్రిమెంట్ తెచ్చుకొని దళితులు, గిరిజనులు, బిసిలను పది మందిని మూడు నెలల జీతాలు అడిగినందుకు నిర్ధాక్షణంగా తొలగించడం దారుణమన్నారు. ఎటువంటి ముందస్తు నోటీసులు ఇవ్వకుండా బయటికి గెంటివేయడం దుర్మార్గమైన చర్య అని పేర్కొన్నారు. పేదల కడుపు కొట్టిన కాంట్రాక్టర్‌పై చర్యలు తీసుకోవాలని, తొలగించిన సిబ్బందిని విధుల్లోకి తీసుకోవాలని డిమాండ్ చేశారు. స్థానిక శాసనసభ్యులు లేఖ ఇచ్చినా కూడా యాజమాన్యం లెక్క చేయకపోవడం బాధాకరమన్నారు. 25 రోజులుగా న్యాయం కోసం పోరాటం చేస్తున్న కార్మికులకు అండగా ఉంటామని తెలిపారు. కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షులు బొజ్జ శివయ్య, మండల నాయకులు వెంకటరమణ పాల్గొన్నారు.

ఫీజు పోరు పోస్టర్ ఆవిష్కరణ

ప్రజాశక్తి-రాయచోటి టౌన్

ఈనెల 5న వైసిపి ఆధ్వర్యంలో చేపట్టనున్న ఫీజు పోరు పోస్టర్‌ను ఆదివారం అన్నమయ్య జిల్లా వైసిపి అధ్యక్షులు, ఎమ్మెల్యే ఆకేపాటి అమరనాథరెడ్డి, వైసిపి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గడికోట శ్రీకాంత్‌రెడ్డి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఏర్పడి 8 నెలలు అవుతున్నా పజలకు ఇచ్చిన హామీలను మరిచిపోయి ప్రజలను మభ్య పెట్టి మోసం చేస్తున్నారని అన్నారు. దివంగత నేత మాజీ ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్ రెడ్డి ప్రతీ పేదవాడు ఉన్నత చదువుకోవాలని ఫీజు రీఎంబర్స్‌మెంట్ ప్రవేశపెట్టారన్నారు. మాజీ సిఎం జగన్ మోహన్‌రెడ్డి ఇంకో రెండు అడుగులు ముందుకు వేసి నాడు-నేడు పేరు ప్రయివేట్ పాఠశాలల కంటే ధీటుగా ప్రభుత్వ పాఠశాలను అభివృద్ధి చేశాం న్నారు. ఈనెల 5న నిర్వహించబోయే ఫీజు పోరుకు విద్యార్థులు, తల్లిద ండ్రులు పార్టీ శ్రేణులు పాల్గొనాలని తెలిపారు. కార్యక్రమంలో జిల్లా విద్యార్థి విభాగం నాయకులు, బీసీ సెల్ నాయకులు, మైనారిటీ నాయ కులు, ఎంపిటిసిలు, కౌన్సిలర్లు, సర్పంచ్‌లు, వైసిపి నాయకులు పాల్గొన్నారు.



అవార్డు అందుకుంటున్న మహ్మద్‌ఖాన్

మదనపల్లె ఉపాధ్యాయుడికి జాతీయ స్థాయి అవార్డు

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్ : తమిళనాడు లోని తిరుపత్తూరులో అలరించిన జాతీయ స్థాయిఉర్దూ కవి సమ్మేళనంలో మదనపల్లె జడ్‌పి ఉన్నత పాఠశాలలో ఇంగ్లీష్ ఉపాధ్యాయుడిగా పనిచేస్తున్న పఠాన్ మహమ్మద్ ఖాన్‌కు జాతీయ స్థాయి ఆషిఖ్-ఏ-రసూల్ అవార్డు లభించింది. శనివారం రాత్రి నుంచి ఆది వారం ఉదయం వరకు తమిళనాడులోని తిరుపత్తూరులో నిర్విరామంగా అఖిల భారత ఉర్దూ కవి సమ్మేళనం జరిగింది. ఈ సందర్భంగా తమిళనాడు అంజుమన్ -ఏ-మొహిబ్బాన్-ఏ- ఉర్దూ సంస్థ అధ్యక్షుడు సయ్యద్ మజహర్ పీరా, కార్యదర్శి అన్వర్ ఖాదరీలు జాతీయ స్థాయిలో మహమ్మద్ ఖాన్ ఉర్దూ సాహితీ సేవలను కొనియాడారు. అనంతరం ఆయనకు దుశ్శాలువ, జ్ఞాపిక తో సత్క రించి జాతీయ స్థాయి అవార్డును ప్రదానం చేశారు. కార్యక్రమంలో వివిధ రాష్ట్రా లకు చెందిన ఉర్దూ కవులు, సాహితీ వేత్తలు, భాషాభి మానులు పాల్గొన్నారు.

వార్డెన్ సేవలు ప్రశంసనీయం

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్ : బిసి హాస్టల్ వార్డెన్ ఎం.వెంకటేష్ సేవలు ప్రశంసనీయమని బిసి సంఘాల ప్రతినిధులు అన్నారు. రిపబ్లిక్‌డే నాడు కలెక్టర్ చేతుల మీదుగా ఉత్తమ హాస్టల్ వార్డెనుగా ప్రశంసా పత్రం అందుకున్న వార్డెన్ ఎం.వెంకటేష్ కు బిసి కులాల ఐక్యవేదిక ఆధ్వర్యంలో అభినందనలు తెలియజేశారు. ఆదివారం బిసి సంఘాల ఆద్వర్యంలో యూత్ కరాటే క్లబ్ కార్యాలయంలో గజమాల వేసి, దుశ్శాలువతో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా బిసి సంఘాల ప్రతినిధులు మాట్లాడుతూ నేటి యువతకు బిసి హాస్టల్ వార్డెన్ ఎం.వెంకటేష్ ఆదర్శనీయమని అన్నారు. ఆపదలో ఉన్న వారికి ఆర్థిక సాయం అందించడమే కాకుండా ఎన్నో ప్రజాసేవ కార్యక్రమాలు నిర్వహించారని వివరించారు. వార్డెన్ ఎం.వెంకటేష్ మాట్లాడుతూ తన సేవలను గుర్తించి సన్మానించిన బిసి సంఘాల ప్రతినిధులకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో యూత్ కరాటే క్లబ్ అధ్యక్షులు డాక్టర్ ఎఆర్.సురేష్, పాలఏకరి సంఘం నాయకులు జెన్నే రాజేంద్రనాయుడు, నాయీబ్రాహ్మణ సంఘం అధ్యక్షులు సుబ్రహ్మణ్యం, వికలాంగుల సంఘం నాయకులు మౌలాలి, యాదవ సంఘం నాయకులు నరసింహ యాదవ్, రజక సంఘ నాయకులు వెంకటరమణ, బిసి కుల సంఘ నాయకులు పాల్గొన్నారు. .



వెంకటేష్‌ను సన్మానిస్తున్న బిసి సంఘాల ప్రతినిధులు



బాధితుడికి సిఎం సహాయనిధి చెక్కును అందిస్తున్న ఎమ్మెల్యే శ్రీధర్, వరలక్ష్మి

పేదలకు వరం సిఎం సహాయనిధి

ప్రజాశక్తి-పుల్లంపేట

సిఎం సహాయనిధి పేదలకు వరం లాంటిదని ఎమ్మెల్యే అరవ శ్రీధర్ పేర్కొన్నారు. మండల పరిధిలోని వత్తలూరు పంచాయతీ మల్లం వారిపల్లి గ్రామానికి చెందిన బోగిరెడ్డి సుబ్బారెడ్డి కుటుంబానికి ముఖ్యమంత్రి సహాయ నిధి కింద ఆదివారం రూ.40,900లు చెక్కును కుడా చైర్మన్ ముక్కా రూపానందరెడ్డి సతీమణి ముక్కా వరలక్ష్మి, ఎమ్మెల్యే శ్రీధర్ చేతులమీదుగా కుటుంబ సభ్యులకు అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ముఖ్యమంత్రి సహాయ నిధి బాధితులకు అండగా ఉంటుందని పేర్కొన్నారు. ముఖ్యమంత్రి సహాయ నిధి కోసం తాము ప్రత్యేకంగా విజయవాడలో ఓ వ్యక్తిని నియమించి చామని, నియోజకవర్గంలో ప్రతి ఒక్కరికి సహాయం అందించేందుకు ముందుంటామని పేర్కొన్నారు. కూటమి ప్రభుత్వం వల్ల ప్రజల జీవితాల్లో చిరునవ్వులు వెదజల్లుతున్నాయని పేర్కొన్నారు. గడచిన ఐదేళ్లలో అభివృద్ధికి కరువైన గ్రామంలో అభివృద్ధికి బాటలు వేస్తున్నామని పేర్కొన్నారు. కార్యక్రమంలో కూటమి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఎస్‌సి వర్గీకరణ జెఎసి జిల్లా చైర్మన్‌గా గంగాధరం

ప్రజాశక్తి-లక్కిరెడ్డిపల్లి

ఎస్‌సి వర్గీకరణ జెఎసి అన్నమయ్య జిల్లా చైర్మన్ నల్లగొల్ల గంగాధరం నియమిస్తూ రాష్ట్ర ఎస్‌సి వర్గీకరణ జెఎసి చైర్మన్, జాతీయ ఎస్‌సి, ఎస్‌టి హబ్ సభ్యులు మామిడి సుదర్శన్ నియామక పత్రం అందించారు. ఈ సందర్భంగా గంగాధర మాట్లాడుతూ నాపై నమ్మకం ఉంచి నన్ను అన్నమయ్య జిల్లా ఎస్‌సి వర్గీకరణ జాయింట్ యాక్షన్ కమిటీ చైర్మన్‌గా నియమించి నందుకు సుదర్శన్‌కు ధన్యవాదాలు తెలిపారు. కేంద్రంలోని ఎన్‌డిఎ ప్రభుత్వం ఎస్‌సి వర్గీకరణను అమలు చేయాలన్నారు. ప్రధానమంత్రి నరేంద్రమోడీ వెంటనే కేంద్ర ప్రభుత్వం వర్గీకరణ చేయడానికి ఒక కమిటీ వేయాలని డిమాండ్ చేస్తున్నామన్నారు. జస్టిస్ ఉష మెహర కమిషన్ ఇచ్చిన సూచనలు పరిగణలోకి తీసుకోవాలన్నారు. ఐఎఎస్, ఐపిఎస్, ఐఆర్‌ఎస్ ఉద్యోగాలతో పాటు సెంట్రల్ సర్వీసెస్, స్టాఫ్ సెలక్షన్ కమిషన్, బ్యాంక్, రైల్వే, విమానయాన శాఖ, ఎల్‌ఐసి, కోర్టులు అన్ని ప్రభుత్వ రంగ కంపెనీలలో ఎస్‌సి వర్గీకరణ అమలు చేయాలన్నారు.



సంఘం అధ్యక్షుడు మల్లు సుబ్బ నరసారెడ్డిని సన్మానిస్తున్న విభిన్న ప్రతిభావంతులు

డాక్టరేట్‌తో బాధ్యత మరింత పెరిగింది

ప్రజాశక్తి-పుల్లంపేట

మండల కేంద్రంలోని ఎస్‌బివిడి సభా ప్రాంగణంలో విభిన్న ప్రతిభావంతుల సమైక్య సేవా సంఘం అధ్యక్షుడు మల్లు సుబ్బనరసారెడ్డికి హైదరాబాద్‌లోని మినిస్ట్రీస్ ఆఫ్ ఫ్రెండ్‌షిప్ వారు తమ సంఘ అధ్యక్షుడికి డాక్టరేట్ ఇచ్చిన సందర్భంగా విభిన్న ప్రతిభావంతుల సమైక్య సేవా సంఘం ఉపాధ్యక్షుడు ఎస్‌ఎండి వాహిద్ అధ్యక్షతన సన్మాన కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా వాహిద్ మాట్లాడుతూ విభిన్న ప్రతిభావంతుల సంఘం అధ్యక్షుడు మల్లు సుబ్బనరసారెడ్డి డాక్టరేట్ రావడం గర్వకారణమని మేము చేసిన సేవలు మా సంఘం అభివృద్ధిలో కీలక పాత్ర పోషించారని అన్నారు. భవిష్యత్తులో మరిన్నీ సేవా కార్యక్రమాలు మా సంఘం ద్వారా నిర్వహించి దివ్యాంగులకు ఆదర్శంగా నిలుస్తామని తెలిపారు. కోశాధికారి నరసింహులు మాట్లాడుతూ విభిన్న ప్రతిభావంతులను ప్రోత్సాహిస్తే ఎంతటి విజయాలనైనా సాధించవచ్చని అన్నారు. రాబోయే రోజుల్లో తాము చేసే సేవా కార్యక్రమాలకు ఈ అవారు ఎంతో ఉత్సాహాన్ని నింపుతుందని అన్నారు. సన్మాన కార్యక్రమంలో సంఘ జాయింట్ సెక్రెటరీ అబ్దుల్ మజీద్, సభ్యులు జ్యోతీశ్వర్ ,శ్రీనివాసులు, ఆనంద్, వాలంటీర్లు నాగార్జున, మురళీ పాల్గొన్నారు.

ఆటో డ్రైవర్లు నిబంధనలు తప్పక పాటించాలి

ప్రజాశక్తి - ఖాజీపేట

ఆటోడ్రైవర్లు ట్రాఫిక్ నిబంధనలను తప్పక పాటించాలని, వాటిని అతిక్రమిస్తే కఠిన చర్యలు తప్పవని స్థానిక సిఐ మోహన్ హెచ్చరించారు. ఆదివారం పోలీస్‌స్టేషన్ కార్యాలయంలో ఆటో డ్రైవర్లకు కౌన్సెలింగ్ నిర్వహించారు. ఈ సం దర్భంగా సిఐ మాట్లా డుతూ.. తమ వాహ నాలకు తప్పక నెంబర్‌ను కలిగి ఉండాలన్నారు. పోలీస్ నెంబర్‌లేని ఆటో లపై చర్యలు తీసుకుం టామన్నారు. రాత్రి సమ యాల్లో ఆటోడ్రైవర్లకు ఎవరైనా ఆనమాస్పదంగా కనిపిస్తే వెంటనే పోలీ సులకు సమాచారం అందించాలని చెప్పారు. ఆటోలో ప్రయాణించే ప్రయాణికుల పట్ల మర్యాదపూర్వకంగా వ్యవహ రించాలన్నారు. హేళనగా ప్రవర్తిస్తే కఠిన చర్యలు ఉంటాయని సిఐ హెచ్చరించారు.

భారీ వాహనాల రాకపోకల అడ్డగింత

ప్రజాశక్తి - పులివెందుల రూరల్ : మండల పరిధిలోని కొత్తపల్లి గ్రామంలో మట్టిని తీసుకెళ్తున్న భారీ వాహనాల రాకపోకలను ఆ గ్రామస్తులు ఆదివారం అడ్డుకున్నారు. వీటివల్ల రోడ్లు, పంటలు దెబ్బతింటున్నాయని కొత్తపల్లె ప్రజలు ఆందోళన వ్యక్తం చేశారు. ఎర్రబల చెరువు నుంచి ఇతర ప్రాంతాలకు మట్టిని తరలిస్తూ కొత్తపల్లి గ్రామం మీదుగా భారీ వాహనాలు వెళుతున్నాయి. రోడ్లు, సాగు చేసిన అరటి పంటలు పూర్తిగా దెబ్బతింటున్నాయని వారు వాపోతున్నారు. వారం రోజుల క్రితం వేసిన తారు రోడ్డు భారీ వాహనాలు రావడంతో రోడ్డంతా పగిలిపోయిందని ఆగ్రహం వ్యక్తం చేశారు. భారీ వాహనాలు మట్టి వేసుకొని వస్తుండడంతో రోడ్లపై ఉన్న మట్టి అంతా అరటి గెలలకు చుట్టుకుంటోందని, దీంతో అరటి గెలలు వృద్ధి చెందడం లేదని రైతులు వాపోతున్నారు. భారీ వాహనాలు గ్రామంలో వెళ్లకుండా స్థానికులు రోడ్డుపై ముళ్లచెట్లు, రాళ్లను అడ్డుపెట్టారు. సంబంధిత అధికారులు కూడా భారీ వాహనాలు రాకుండా చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు.

రోడ్డు భద్రతా నియమాలు పాటించాలి

ప్రజాశక్తి - ముద్దనూరు : వాహనదారులు రహదారి భద్రత పాటించాలని సిఐ దస్తగిరి పేర్కొ న్నారు. జాతీయ రహదారి భద్రతా వారోత్సవాల్లో భాగంగా స్థానిక పాత బస్టాండ్ కూడలిలో సిఐ ఆధ్వర్యంలో ఆటోడ్రైవర్లకు రోడ్డు భద్రతపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా సిఐ మాట్లాడుతూ వేగం కన్నా ప్రాణం మిన్న అన్నారు. మద్యం సేవించి వాహనాలు నడిపితే శిక్షార్హులు అవుతారన్నారు. బైక్ నడిపేవారు హెల్మెట్, కారులో వెళ్లేవారు సీట్‌బెల్ట్ తప్పక ధరించాలన్నారు. చిన్నపిల్లలకు బైక్‌లు ఇవ్వరాదన్నారు. వాహనాలకు సంబంధించిన పత్రాలను దగ్గరే ఉంచుకోవాలన్నారు. ట్రాఫిక్ నిబంధనలు పాటిస్తే ప్రమాదాలను నివారించవచ్చన్నారు. సిబ్బంది, ప్రజలు పాల్గొన్నారు.

రెయిన్ బో పాఠశాల విద్యార్థులకు బహుమతులు

ప్రజాశక్తి - ఖాజీపేట : కడప పట్ట ణంలో రెండు రోజులుగా జరిగిన బాలోత్సవం కార్యక్రమంలో స్థానిక రెయిన్ బో పాఠశాల విద్యార్థులు బహుమతులు సాధించారు. బాలోత్సవ కార్యక్రమంలో భాగంగా నిర్వహించిన పిల్లల పండుగ కార్యక్రమంలో 11 అత్యధిక బహుమతులు సాధించారు. ఇవి తమ విద్యా సంస్థలకు గర్వకారణమని ఆ పాఠశాల కరస్పాండెంట్ తవ్వా సుధా కర్‌రెడ్డి తెలిపారు. వివిధ పోటీ పరీక్షలు, సైన్స్ ప్రయోగ విభాగంలో బహు మతులను అందుకున్న బిందుశ్రీ, సంతోష్‌రెడ్డి, వాణి, అస్మి సాహిత, చైతన్య, ఆఫ్రిన్ సుల్తానా లక్ష్మీప్రణతి, ఆసిఫ్, అభిరామ్, ఆర్పీనా, షేక్ కాదియా బహు మతులు గెలుపొందారు. పాఠశాల యాజమాన్యం విజేత లను ఘనంగా సన్మానించింది.

అన్నప్రాసనే..ఆయువు తీసిందా

ఆరు నెలల పసికందు మృతితో తల్లిదండ్రులకు కడుపుకోత

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

పండంటి బిడ్డ పుట్టాడన్న సంతోషం ఆ తల్లిదండ్రులలో వెల్లువికింది. రోజూ బిడ్డతో ఆడుకుంటున్న తల్లికి, కుటుంబ సభ్యులకు అంతులేని ఆనందం. పేరు పెట్టి అన్నప్రాసన చేయాలన్న తలంపుతో ఆదివారం గుడికి వెళ్లారు. పేరు పెట్టి అన్నప్రాసన చేసి బయటకు రాగానే బిడ్డలో కదలికల్లేవు. ఏమైందో ఏమోనని పరుగు పరుగున ఆసుపత్రికి చేరుకున్నారు. పరీక్షించిన వైద్యులు బిడ్డ లేడని చెప్పడంతో కన్నీరు మున్నీరుగా విలపించారు. ఈ హృదయ విదారక సంఘటన ఆదివారం మదనపల్లె జిల్లా ఆస్పత్రి వద్ద కనిపించింది. మృతి చెందిన పసికందు కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల మేరకు.. గుర్రంకొండ మండలం, మర్రిమాకులపల్లెకు చెందిన బాలాజీ నాయక్, భారతిలకు ఏడాదిన్నర క్రితం వివాహమైంది. వీరికి ఆరు నెలల క్రితం మగ బిడ్డ జన్మించాడు. అల్లారు ముద్దుగా పెంచుకున్న బిడ్డకు అన్నప్రాసన చేసి పేరు పెట్టాలని బంధువులతో కలిసి ఆదివారం తరిగొండ వద్ద ఉన్న లక్ష్మీ నరసిం హస్వామి గుడికి వెళ్లారు. అక్కడ బిడ్డకు పూర్విక్ నాయక్ అని నామకరణం చేసి అన్నప్రాసన చేశారు. సంతోషంగా బయటికి వచ్చిన వారి ఆశలు క్షణాల్లో ఆవిరైపోయాయి. అన్నప్రాసన చేసిన కొద్దిసే పటికే బిడ్డలో చలనం లేకపోవడంతో తీవ్ర అందోళనకు గురయ్యారు. కన్నులు తెరవలేదు, ఉలుకూ పలుకూ లేదు. ఏమైందో ఏమోనన్న కంగారుతో తండ్రి పరుగు పరుగున ద్విచక్ర వాహంలోనే బిడ్డను తీసుకుని మదనపల్లి జిల్లా ఆస్పత్రికి చేరుకున్నాడు. పరీక్షించిన వైద్యులు అప్పటికే ఆ పసికందు మృతి చెందినట్లు చెప్పడంతో కుటుంబ సభ్యులు, తల్లిదండ్రులు కన్నీరు మున్నీరుగా విలపించారు. ఇలాంటి శిక్ష పగవారికి కూడా రాకూ డదంటూ అక్కడి వారు చర్చించుకుంటూ తీవ్ర దిగ్భ్రాంతిని వ్యక్తం చేశారు.



మృతి చెందిన పసికందు,కన్నీరు మున్నీరుగా విలపిస్తున్న కుటుంబ సభ్యులు

క్రమశిక్షణతో లక్ష్యాలను నిర్ధారించుకోవాలి

రవాణా శాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి



మాట్లాడుతున్న మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి

ప్రజాశక్తి-రామాపురం

విద్యార్థి దశ నుంచే క్రమశిక్షణతో లక్ష్యాలు నిర్ధారించుకొని అటు వైపు అడుగులు వేయాలని రాష్ట్ర రవాణా యువజన క్రీడల శాఖల మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి పిలుపునిచ్చారు. మండలంలోని నల్లగుట్టపల్లి సమీపంలోని డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ సాంఘిక సంక్షేమశాఖ గురుకుల పాఠశాలలో ఆదివారం1998-99 సంవత్సరం పదవ తరగతి పూర్వ విద్యా ర్థుల సమ్మేళనం నిర్వహించారు. ఈ సమ్మేళనానికి ముఖ్య అతిథిగా మంత్రి హాజరై మాట్లాడారు. విద్యార్థులు విద్యార్థి దశ నుంచే సత్ప్రవర్తన కలిగి విద్యా భ్యాసాన్ని కొనసాగించి ఉన్నత స్థానాలకు చేరుకోవాలన్నారు. సంక్షేమ హాస్టల్లో చదువుకునే పిల్లలు ఇంటిదగ్గర తల్లిదండ్రులు ఎన్నో కష్టనష్టాలకు పడుతూ పిల్లలను చదివించుకోవాలనే కోరికతో చేరుస్తారని, వారి ఆశలకు అనుగు ణంగా చదువుకొని ఉన్నత స్థానాలు ఎదగాలన్నారు. చెడు వ్యసనాలకు బాని సలు కాకుండా తల్లిదండ్రులకు, చదువుకున్న పాఠశాలకు మంచి పేరు తీసు కురావాలని అన్నారు. రామాపురం గురుకుల పాఠశాలకు గతంలో ఎంతో మంచి పేరు ఉండేదని ఆ పేరును కొన సాగించాలన్నారు. రెసిడెన్షియల్ స్కూల్ కావడంతో ఉపాధ్యాయులు కూడా విద్యార్థుల ప్రవర్తన పై దృష్టి సారించి మంచి మార్గంలో నడిపించాలని సూచించారు. పూర్వపు విద్యార్థులు పాఠశాల అభివృద్ధికి తమ వంతు సహాకారం అందించడం అభినందనీ య మని అన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపల్ వరప్రసాద్, ఆర్ట్ మాస్టర్ ఆనంద్, అధ్యాపకులు, ఉపాధ్యాయులు, పూర్వపు విద్యార్థులు, టిడిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

గ్రామాల్లో మౌలిక వసతుల కల్పనే లక్ష్యం

ప్రజాశక్తి-పుల్లంపేట

రైల్వేకోడూరు నియోజకవర్గ పరిధిలోని ప్రతి గ్రామంలో మౌలిక వసతులు కల్పిస్తామని ఎమ్మెల్యే అరవ శ్రీధర్,కుడా చైర్మన్ ముక్కా రూపానందరెడ్డి పేర్కొన్నారు. మండల పరిధిలోని కొత్తపేట గ్రామంలో రూ.10 లక్షల వ్యయంతో, కుమారునిపల్లి దళితవాడలో రూ.6లక్షల వ్యయంతో సిమెంటు రోడ్డు రహదారి నిర్మాణానికి వారు భూమిపూజ చేశారు. అనంతరం వారు మాట్లాడుతూ అభివృద్ధి అంటే మాటల్లో చెప్పడం కాదని చేతల్లో చేసి చూపించడమని పేర్కొన్నారు. సంపూర్ణ గ్రామీణ అభివృద్ధి లక్ష్యంగా ముందుకు సాగుతున్నామని కూటమి ప్రభుత్వం ప్రజల కోసం పనిచేస్తుందని తెలిపారు. ప్రజా పాలన ఎలా ఉంటుందో చేసి చూపుతు న్నామని పేర్కొన్నారు. గత వైసిపి ప్రభుత్వం మాదిరిగా ఏదో మాయ మాటలు చెప్పి కాలయాపన చేసే ప్రభుత్వం తమది కాదని, చేతులతో చూపించే ప్రభుత్వం తమదని అన్నారు. గ్రామంలో ఎటువంటి సమస్యలున్నా తమ దృష్టికి తీసుకవస్తే పరిష్కరించేందుకు కృషి చేస్తామని చెప్పారు. కార్యక్రమంలో జనసేననాయకుడు పసుపులేటి వెంకటరమణ, మండల ఉపాధ్యక్షుడు చంద్రశేఖర్‌నాయుడు, కూటమి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



రూపానందరెడ్డి, ఎమ్మెల్యే శ్రీధర్‌ను సన్మానిస్తున్న గ్రామస్తులు



బిఎం.బాషా స్వాగతం పలుకుతున్న మజ్దూర్ యూనియన్ రైల్వే కార్మికులు

కార్మికుల సమస్యల పరిష్కారంలో యూనియన్ ముందంజ

ప్రజాశక్తి - నందలూరు

కార్మికుల సమస్యల పరిష్కారంలో సౌత్ సెంట్రల్ రైల్వే మజ్దూర్ యూనియన్ ముందంజలో ఉంటుందని గుంతకల్ డివిజనల్ మజ్దూర్ యూనియన్ ప్రెసిడెంట్ కామ్రేడ్ బి.యం.బాషా పేర్కొన్నారు. డివిజన్ ప్రెసిడెంట్‌గా ఎన్నికైన తర్వాత మొదటిసారి నందలూరు వచ్చిన ఆయనకు స్థానిక బ్రాంచ్ మజ్దూర్ యూనియన్ కార్మికులు ఆదివారం ఘనంగా స్వాగతం పలికారు. నందలూరు రైల్వే స్టేషన్ నుంచి ర్యాలీగా వచ్చి మజ్దూర్ యూనియన్ ఆఫీసు లో జరిగిన భారీ బహిరంగ సభలో పాల్గొన్నారు. ఈ సభలో బ్రాంచ్ చైర్మన్ పి.గోపీనాథ్ మాట్లాడుతూ ఎన్నో సంవత్సరాలు మజ్దూర్ యూనియన్‌కు సెక్రటరీగా, చైర్మన్‌గా సేవలందించిన మా నందలూరు వ్యక్తి అయిన బి.యం.భాషా కి ప్రెసిడెంట్ పదవి రావడం చాలా సంతోషాన్ని ఇచ్చిందని అన్నారు.భవిష్యత్‌లో మరిన్నీ పదవులు అధిరోహించాలని కోరారు. యూనియన్ సెక్రటరీ కె.విశ్వనాథ్ మాట్లాడుతూ బి.ఎం.భాషాకు యూనియన్ అంటే ఎంత అభిమానమో నేను కళ్ళారా చూశానని డ్యూటీ అయిపోయిన తరువాత మొదట యూనియన్ ఆఫీసుకు వచ్చి కార్మికుల సమస్యలు తెలుసుకొని తరవాత ఇంటికి వెళ్ళే వారని, యూనియన్ కోసం అంకితభావంతో పనిచేసే వారని కొనియాడారు. కార్యక్రమంలో మజ్దూర్ యూనియన్ కార్మికులు పెద్ద యెత్తున పాలొన్నారు.



సురేంద్రరావును సన్మానిస్తున్న ఎంఇఒలు

విద్యాభివృద్ధికి సురేంద్ర కృషి అభినందనీయం

ప్రజాశక్తి-పీలేరు

పాఠశాల ఉపాధ్యాయుడిగా, ప్రధానోపాధ్యాయుడిగా విద్యార్థుల విద్యాభివృద్ధికి సురేంద్ర రావు చేసిన కృషి ప్రశంసనీయమని ఎంఇఒలు శెట్టిపల్లి సిద్ధరామయ్య, పోకల తాతయ్య తెలిపారు. చిత్తూరు జిల్లా, వి.కోటమండలం, కరిప్పల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధాన ఉపాధ్యాయులుగా పనిచేస్తూ సురేంద్రబాబు ఉద్యోగ విరమణ పొందారు. ఆదివారం పీలేరులో సురేంద్రరావు ఇంటికి ఎఇఒలు, ఉపాధ్యాయులు సంయుక్తంగా వెళ్లి దంపతులను ఘనంగా సన్మానించి సత్కరించారు. పీలేరు మండలంతో పాటు పరిసర ప్రాంతాల్లో ఆయన ఉపాధ్యాయుడిగా, ఎంఆర్‌సిగా37 ఏళ్ల పాటు పనిచేసి ప్రధానోపాధ్యాయులుగా వి.కోట మండలానికి బదిలీపై వెళ్లిన ఆయన అక్కడే ఉద్యోగ విరమణ చేశారు. ఈ సందర్భంగా ఎంఇఒలు మాట్లాడుతూ సురేందర్ రావు ఉమ్మడి చిత్తూరు జిల్లాలో వివిధ మండలాల్లో పని చేసి, ఆయా పాఠశాల అభివృద్ధికి, విద్యార్థుల విద్యాభివృద్ధికి ఎనలేని కృషి చేశారని, జిల్లా స్థాయిలో ఉత్తమ ఉపాధ్యాయుడి పురస్కారాన్ని కూడా అందుకున్నారని చెప్పారు. కార్యక్రమంలోమానవతా సంస్థ చైర్మన్ వంగిమళ్ళ రామచంద్ర, పీలేరు, పులిచెర్ల మండలాల ఉపాధ్యాయ మిత్రులు రాజేంద్ర, పోతంశెట్టి రమేష్, వెంకటసుబ్బయ్య, రహత్ బాష, రాచపల్లి కృష్ణమూర్తి, శెట్టి సుబ్రహ్మణ్యం, పోకల కిషోర్ కుమార్, రమణా రెడ్డి పాల్గొన్నారు.

విశ్రాంత ఉద్యోగుల సంక్షేమమే ధ్యేయం

ప్రజాశక్తి-కలికిరి

విశ్రాంత ఉద్యోగుల సంక్షేమమే ధ్యేయమని విశ్రాంత ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు సురేంద్ర రెడ్డి తెలిపారు. ఆదివారం స్థానిక షాది మహల్ లో రిటైర్డ్ ఎంప్లాయిస్ సమావేశం జి.జయరాం , బసవయ్య సురేంద్ర రెడ్డి ఆధ్వర్యంలో జరిగింది. ఈ సందర్భంగా సురేంద్ర రెడ్డి మాట్లాడుతూ కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి నిర్మల సీతారాం పార్లమెంటులో ప్రవేశపెట్టిన బడ్జెట్లో దేశంలోని వేతన జీవులకు ఆదాయ పన్ను 12.75 లక్షల వరకు ఐటి కాకుండా ప్రకటించినందులకు వారికి ప్రత్యేకంగా రిటైర్డ్ ఉద్యోగ సందర్భంగా అన్నమయ్య జిల్లా తరపున ధన్యవాదాలు తెలిపారు. ఈనెల చివరిలోపు లైఫ్ సర్టిఫికెట్స్ అందరూ ఇవ్వాలని లేదా రేపు నెలలో పింఛన్ నిలువ వేయబడునని తెలిపారు. కలికిరి మండల రిటైర్డ్ ఉద్యోగులు 23న మన యూనిట్ తరపున అందరికీ బస్సు సౌకర్యం కల్పించి విహారయాత్రలో గండి ఆంజనేయస్వామి, రాయచోటిలో వీరభద్ర వారి దర్శన భాగ్యం కల్పిస్తున్నట్లు తెలిపారు. జయరాం మాట్లా డుతూ అందరూ సభ్యులు సంవత్సర వారి చెల్లింపులు చెల్లించాలని కోరారు. కార్యక్రమంలో కాంత మ్మ, డి.సరోజమ్మ, టి.సరోజమ్మ, నాగప్ప, అల్లాబకాష్, పి.లక్ష్మయ్య, కె.వెంకటరమణ పాల్గొన్నారు.

టిడిపి ప్రభుత్వంలోనే అభివృద్ధి సాధ్యం

ప్రజాశక్తి - పులివెందుల రూరల్

2029లో మళ్లీ చంద్రబాబు అధికారం చేపడతారని మాజీ మార్కెట్ యార్డ్ చైర్మన్ తుగుట్ల మధుసూదన్‌రెడ్డి తెలిపారు. తన నివాసంలో ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ టిడిపి అధికారంలోకి వచ్చిన ఎనిమిది నెలల్లో పులివెందులలో కొన్నేళ్లుగా జరుగుతున్న మట్కాను నిషేధించిందన్నారు. ఉచిత ఇసుక, మైనింగ్ అక్రమ రవాణా కాకుండా అడ్డుకట్ట వేసిందన్నారు. 2014లో పులివెందులలో నీటి సమస్య ఎక్కువ కావడంతో అప్పటి టిడిపి ప్రభుత్వం అధికారం చేపట్టిన వెంటనే పులివెందుల ప్రాంత టిడిపి నాయకులు ఈ ప్రాంతానికి నీరు వచ్చేలా చేయాలని ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళితే సత్వరమే రూ.కోటి వెచ్చించి రైతుల నీటి కష్టాలు తీర్చా రన్నారు. 2019లో అధికారంలోకి వచ్చిన వైసిపి నాయకులు దోచుకున్నారే తప్ప, ప్రజలకు చేసిందేమీ లేదన్నారు. పులివెందులకు మళ్లీ నీటి కష్టాలు తప్పలే దన్నారు. ఈ నేపథ్యంలో 2024లో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక నక్కపల్లి డ్యామ్‌లో నీటి పైపులైన్ లీకేజీ పనుల కోసం రూ.50 లక్షలు వెచ్చించారన్నారు. తాము చెప్పిన ప్రతి పథకం తప్పకుండా దశలవారీగా అమలు చేస్తామని తెలిపారు. కార్యక్రమంలో అంకాల్‌రెడ్డి పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల కలయిక

ప్రజాశక్తి - లింగాల

మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ హైస్కూల్‌లో 1997-98 బ్యాచ్ పదో తరగతి విద్యా ర్థులు ఆదివారం కలుసు కున్నారు. 28 ఏళ్ల తర్వాత వారు చదువుకున్న పాఠశాలలో వారి కలయిక మధు రానుభూతిగా నిలిచింది. ఈ క్రమంలో ఒకరికొకరు యోగ క్షేమాలు అడిగి తెలుసుకున్నారు. తమకు విద్యా బుద్ధులు నేర్పించిన ఉపాధ్యాయులను సన్మానించారు. అనంతరం తమతోపాటు చదివిన గురుప్రసాద్ ఇటీవల అనారోగ్యంతో మృతి చెందడంతో వారి కుటుంబ సభ్యులకు రూ.లక్ష ఆర్థిక సాయం అందజేశారు. పాఠశాలకు నీటి శుద్ధి యంత్రాన్ని వితరణ చేశారు. అప్పటి పాఠశాల వ్యాయామ ఉపాధ్యాయుడు పెండ్యాల కృష్ణమూర్తికి బీరువాను అందజేశారు. ఈ సందర్భంగా అప్పటి జ్ఞాపకాలను గుర్తు చేసుకొని ఆహ్లాదకరంగా గడిపారు. కార్యక్రమంలో విశ్రాంత ఉపాధ్యాయులు కృష్ణమూర్తి, రామసుబ్బారెడ్డి, లక్ష్మీకాంతమ్మ, ఉపాధ్యాయులు భారతి, పురుషోత్తంరెడ్డి, బాబయ్య పాల్గొన్నారు.



సిఐకి వినతి పత్రం అందజేస్తున్న ఇఒ మునిరాజ

ఆలయ మాన్యంలో ఏర్పాటు చేసిన..

బంకులను ఖాళీ చేయించండి

-సిఐకి దేవాదాయ శాఖ ఇఒ ఫిర్యాదు

ప్రజాశక్తి-బి.కొత్తకోట

పట్టణంలోని ప్రభుత్వ ఆస్పత్రి సమీపంలో ఉన్న ఆంజనేయస్వామి మాన్యం సర్వే నెంబర్ 488లో1.14 ఎకరాల భూమిలో అక్రమంగా కొంత మంది బంకులు నిర్మించుకుని వ్యాపారం చేస్తున్నారని, వారిని వెంటనే ఖాళీ చేయించాలని దేవాదాయ శాఖ ఇఒ మునిరాజ బి.కొత్తకోట సీఐ జీవన్ గంగాధర్నాథ్‌బాబుకి విజ్ఞప్తి చేశారు. ఆదివారం పోలీసుస్టేషన్‌లో హెడ్ కానిస్టేబుల్ రెడ్డెప్ప నాయక్‌కి ఫిర్యాదు పత్రాన్ని అందించారు. ఈ సందర్భంగా ఇఒ మాట్లాడుతూ ఎటువంటి దేవాదాయ శాఖ అనుమతులు లేకుండా దేవుని మాన్యంలో కొంతమంది బంకులు ఏర్పాటు చేసుకుని ఇష్టానుసారంగా వ్యాపారాలు చేసుకుంటున్నారని అన్నారు. ఖాళీ చేయమని పలుమార్లు తెలిపినప్పటికీ బేఖాతరు చేయడంతో పోలీసులను ఆశ్రయించామని తెలిపారు. పోలీసుల సహకారంతో దేవునిమాన్యంలో ఏర్పాటు చేసిన బంకులను తొలగిస్తామని స్పష్టం చేశారు. ఇప్పటికైనా బంకులు ఏర్పాటు చేసుకున్న వారు స్వతహాగా తొలగించి సహకరించాలని, లేనియెడల చట్టపరమైన చర్యలు తీసుకుంటామన్నారు.



ప్రమాణ పత్రాలు పొందిన విద్యార్థులతో సర్తాజ్ హుస్సేన్

విద్యార్థులకు ప్రమాణ పత్రాలు ప్రదానం

ప్రజాశక్తి-పుల్లంపేట

మండల పరిధిలో టీ.కమ్మపల్లి జడ్‌పిహైస్కూల్‌లో ఆదివారం హిందీ ఉపాధ్యాయుడు సయ్యద్ సర్తాజ్ హుస్సేన్ హైదరాబాద్ హిందీ ప్రచార సభ నిర్వహించిన డిగ్రీకి తత్సమానమైన 'హిందీ విద్వాన్' పరీక్షలో 70 శాతం పైగా మార్కులతో ఉత్తీర్ణులైన పదవ తరగతికి చెందిన కె.అమృత ఆర్. మైథిలి, పి.చరణ్‌లకు ప్రమాణ పత్రాలు అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ హైదరాబాద్ హిందీ ప్రచార సభ వారు ప్రతి సంవత్సరం ఫిబ్రవరి, సెప్టెంబర్ నెలలో పరీక్షలు నిర్వహిస్తూ ఉంటారని ఈ పరీక్షల్లో ఉత్తీర్ణులైన వారు భవిష్యత్తులో హిందీ ఉపాధ్యాయులుగా, అధ్యాపకులుగా టిజిటి, పిజిటి పరీక్షలకు అర్హత సాధిస్తారని అన్నారు.

పారిశ్రామిక వాడగా తంబళ్లపల్లి అభివృద్ధి

- దాసరిపల్లి జయచంద్రారెడ్డి

ప్రజాశక్తి-ములకలచెరువు

తంబళ్లపల్లె నియోజకవర్గ అభివృద్ధికి తొలి ప్రాధాన్యం ఇచ్చి పారిశ్రామిక వాడగా అభివృద్ధి చేస్తామని ముఖ్యమంత్రి చంద్రబాబు హామీ ఇచ్చినట్లు నియోజకవర్గ టిడిపి ఇన్‌ఛార్జి దాసరిపల్లి జయచంద్రారెడ్డి తెలిపారు. జిల్లాలోని సంబేపల్లి మండల పర్యటనకు వచ్చిన చంద్రబాబు నాయుడును కలిసి నియోజకవర్గ సమస్యలను ఆయన దృష్టికి తీసుకెళ్లినట్లు తెలిపారు. జాతీయ రహదారి పక్కనే ఎపి ఇండస్ట్రియల్ కార్పొరేషన్ అనుకూలంగా కురబలకోట మండలం, కంటేవారపల్లి వద్ద 600ఎకరాలు, బి. కొత్తకోట మండలం బడికాయలపల్లి వద్ద 2174 ఎకరాల భూములు గుర్తించామని తెలిపారు. ఈ రెండు ప్రాంతాలను పారిశ్రామికంగా అభివృద్ధి చేయాలని కోరినట్లు చెప్పారు. పెద్దమండ్యంలోని సోలార్ సిటీ ఏర్పాటుకు 7300 ఎకరాలు అందుబాటులో ఉందని 39 పెద్ద చెరువులను హంద్రీ నివాతో అనుసంధానంగా చేయాలని కోరినట్లు తెలిపారు. నియోజకవర్గానికి డిగ్రీ కళాశాలలు, ఇంటర్, డిప్లమా కళాశాలలో మంజూరు చేయాలని సిఎంకు చెప్పానని అన్నారు.

క్రైం కార్నర్

మహిళా కానిస్టేబుల్ ఆత్మహత్య కేసులో కొత్త కోణం

-భర్తే హత్య చేశాడని మృతురాలి తండ్రి పోలీసులకు ఫిర్యాదు

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్



రెడ్డి రోజా (ఫైల్ ఫొటో)

మహిళా కానిస్టేబుల్ ఆత్మ హత్య కేసులో అనూహ్య పరిణామం చోటు చేసుకుంది. భర్తే హత్య చేసి ఆత్మహత్య గా చిత్రీకరించాడని మృతురాలి తండ్రి పోలీసులకు ఫిర్యాదు చేశాడు. వివరాల్లోకి వెళితే.. మదనపల్లె పట్టణం రామారావు కాలనీకి చెందిన రెడ్డి రోజా(35)ను నిమ్మనపల్లె రోడ్లోని విద్యోదయ స్కూల్ సమీపంలో ఉంటున్న లక్ష్మి రవికుమార్ కిచ్చి 15ఏళ్ల క్రితం వివాహం జరిపించారు. లక్ష్మి రవికుమార్ ఓ ప్రైవేట్ ఫైనాన్స్ కంపెనీలో పని చేస్తుండగా, రెడ్డిరోజా కలికిరి మండలం, పారపట్ల సచివాలయంలో మహిళా కానిస్టేబుల్‌గా విధులు నిర్వహిస్తోంది. అయితే వీరిద్దరికి పిల్లలు పుట్టలేదు. శనివారం బంధువుల ఇంటిలో జరుగుతున్న ఓనీల ఫంక్షన్‌కు వెళ్లేందుకు రెడ్డిరోజా, లక్ష్మి రవికుమార్ దంపతులు రామారావు కాలనీలోని ఇంటిపై గదిలోకి సిద్ధ పడేందుకు వెళ్లారు. కాసేపటికే లక్ష్మి రవికుమార్ తలుపు గడియ పెట్టుకుని బయటకు వెళ్లిపోయాడు. కుమార్తె ఎంత సేపటికి రాకపోవడంతో తల్లి మనవడిని పైకి పంపింది. పిల్లవాడు పైకి వెళ్లి తలుపు తెరచి చూసి గట్టిగా కేకలేశాడు. కుటుంబసభ్యులు పరుగున వెళ్లి చూడగా రెడ్డిరోజా ఉరికి వేలాడుతూ కనబడింది. వెంటనే కిందకు దింపి ఆస్పత్రికి తరలించగా అప్పటికే ఆమె మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు. అందరూ ఆత్మహత్యగా భావించారు. కాగా భర్తే హత్య చేసి ఆత్మహత్య గా చిత్రీకరించాడని మృతురాలి తండ్రి రెడ్డప్ప పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు కేసు నమోదు చేసిన పోలీసులు మృతురాలి భర్త లక్ష్మిరవికుమార్‌ను అదుపులోకి తీసుకుని విచారిస్తున్నారు.

కన్నతల్లిపై కుమారుడి దాడి

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్ : కని పెంచి పెద్ద చేసిన కన్నతల్లి పై కుమారుడు కర్కశంగా వ్యవహ రించాడు. తల్లికి వయసు మీద పడిందన్న ఆలోచన కూడా లేకుండా చితక బాదాడు. ఈ సంఘటన ఆదివారం కురబలకోట మండలంలో జరిగింది. బాధి తురాలి కథనం మేరకు.. కురబలకోటకు చెందిన లేట్ రసూల్ సాబ్ భార్య బావా బికి ఇద్దరు కుమారులు, కుమార్తె ఉన్నా.. ఒంటరి జీవితం గడుపుతోంది. తన భర్త నుంచి సంక్రమించిన భూమిలో జొన్న కర్రలు పండించుకుని వాటి విక్రయం ద్వారా జీవనం చేస్తోంది. చిన్న కుమారుడు షామీర్‌బాషా తల్లికి తెలి యకుండా ఆమెకు ఆసరగా ఉన్న ఆ జొన్న కర్రలను విక్రయించుకున్నాడు. విషయం తెలుసు కున్న తల్లి ఇలా చేస్తే తానెలా బ్రతకాలని కుమారుడిని ప్రశ్నిం చింది. వృద్ధు రాలైన తల్లి అని కూడా చూడకుండా దాడి చేసి గాయపరిచాడు. విషయం తెలు సు కున్న పెద్ద కుమారుడు ముస్కాన్ అహ్మద్‌తల్లిని మదనపల్లి జిల్లా ఆసుపత్రికి తరలించడంతో పరీక్షించిన వైద్యులు ఆస్పత్రిలో చేర్చి చికిత్స అంది స్తున్నారు. బాధితురాలు తనకు న్యాయం చేయాలని పోలీసులకు ఫిర్యాదు చేసింది.